
మంత్రి దామోదరకు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో అవకతవకలు : ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విధానం లోపభూయిష్టంగా ఉందని, దీని వల్ల 300 మంది రిజర్వేషన్ సీట్లు కోల్పోతున్నారని, వీటిని వెంటనే సరిదిద్ది సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం న్యాయం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామ కృష్ణ, సి.రాజేందర్, అనంతయ్య, సతీష్, శంకర్, నిఖిల్, బలరామ్, భాస్కర్‌తో కలిసి ఆర్.కృష్ణయ్య రిజర్వేషన్లపై మంత్రి దామోదరతో చర్చించారు. అనంతరం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలు

● 27 మంది ఏఎంహెచ్ఓ, డీఈఈలకు స్థానచలనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలు మొదలయ్యాయి. పలు సర్కిళ్లలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తున్న 27 మంది సహాయ వైద్యాధికారులు(ఏఎంహెచ్ఓలు), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(డీఈఈ)లకు స్థానచలనం కల్పిస్తూ కమిషనర్ ఆమ్రపాలి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే సంస్థలోని ఇతర విభాగాల్లోనూ బదిలీలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి ఏఎంసీ వరకు మూడేళ్ల కంటే ఎక్కువకాలం ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. బల్దియా పాలనా విభాగం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి జాబితా సిద్ధం చేసింది.

సంక్షేమ హాస్టళ్ల సిబ్బంది సమయపాలన పాటించాలి


కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేసిన ప్రభాకర్‌రెడ్డి

అంబర్‌పేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎకానమికల్లి వీకర్స్ సెక్షన్(ఈడబ్ల్యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నేతలు అనిల్, కృష్ణలు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి శనివారం వినతిపత్రం అందజేశారు. అన్ని హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. చాలా మంది వార్డెన్‌లు వారానికి, నెలకు ఒకసారి హాస్టల్‌కు వస్తున్నారని ఆరోపించారు.

సుప్రీంకోర్టు రీజినల్ బెంచి ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు రీజినల్ బెంచి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని సౌత్ ఇండియన్ అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్, ఉపాధ్యక్షులు సుదర్శన్, భూపాల్‌రాజు, సంతోష్ డిమాండ్ చేశారు. బెంచి ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. శనివారం బర్కత్‌పురలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ లా కమిషన్ సిఫారసు చేసిందని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్ర న్యాయశాఖ మంత్రి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ కార్యదర్శులు రాజ్‌కుమార్, రాంచంద్రరెడ్డి, శ్రీనివాస్, ప్రవల్లిక, శ్రీధర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థలో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సైకాలజీ, సోషియాలజీ, రీసెర్చ్ మెథడాలజీ, స్టాటిస్టిక్స్, ఇంగ్లిష్, ఐసీటీ/కంప్యూటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఇంగ్లిష్‌లో బోధనలు చేయాల్సి ఉం టుందని చెప్పారు. అర్హత కలిగిన వారు ఈనెల 21న సాయంత్రం 4.30 గంట ల్లోపు మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థలో దరఖాస్తులు అం దజేయాలని, మరిన్ని వివరాలకు 9963119534లో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

● కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ తెలిపారు. శనివారం జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇరిగేషన్ ఏఈ శ్యామ్‌సుందర్, సూపర్‌వైజర్ రవికుమార్, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ఇన్‌స్పెక్టర్ శంకర్, హార్టికల్చర్ సర్కిల్ మేనేజర్ భాస్కర్, అసిస్టెంట్ వెంకటేశ్ తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె అరుంధతినగర్‌బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరుంధతినగర్‌లోని నాలా రిటైనింగ్‌వాల్ నిర్మాణం పటిష్ఠతకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. లోప్రెషర్, సివరేజీ ఓవర్‌ఫ్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, నర్సింగ్‌రావు, ఉమేష్, సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్ కుమార్, నీరజ్, శ్రీనివాస్‌గౌడ్, బస్తీవాసులు చిప్పి రాజు, ప్రకాష్, రాజయ్య, నర్సింగ్, ఆరోగ్యం, సాయిలు, లలిత, భారతమ్మ, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలి

నల్లకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని సత్యానగర్, రత్నానగర్‌తో పాటు లోతట్టు ప్రాంతాల్లోని నాలాల్లో వరదనీరు సాఫీగా వెళ్లేలా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అమృత సూచించారు. శనివారం ఆమె బస్తీల్లోని నాలాలను పరిశీలించారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గెలిపించండి

ముషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా తనను గెలిపించాలని వల్లకటి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం ముషీరాబాద్‌లో పద్మశాలి సభ్యత్వం ఉన్న కుటుంబాలను కలిసి కరపత్రాలను పంచుతూ తనకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలికాలనీ సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంఘంలో సభ్యత్వం ఉన్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ముషీరాబాద్, అంబర్‌పేట, సికింద్రాబాద్, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు చెందిన సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్‌కు చెందిన పద్మశాలి సంఘం నాయకులు బింగి నవీన్, ఎయిర్‌టెల్ రాజు, బల్ల ప్రశాంత్, సత్యనారాయణ, బంటి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం నుంచే మార్పు రావాలి

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని, అబ్బాయిని ఒకేరకంగా పెంచే మార్పు కుటుంబం నుంచే రావాలని ప్రముఖ సైకియాట్రిస్ట్ డా.ఆర్.హరికుమార్, సైకాలజిస్ట్ డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. శనివారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు, పురుషులు సమానమనే భావన సమాజంలో పెంచాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో లింగసమానత్వం గురించి నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కలిగిస్తున్నామన్నారు. వైద్యులు డా.జ్యోతిరెడ్డి, సైకాలజిస్టులు వీరభద్రం, క్యారోలిన్, శోభారాణి, కృష్ణవేణి, జ్యోతిరాజాలు మాట్లాడుతూ అత్యాచారం ఒక సామాజిక సమస్య అని, దీనిని పరిష్కరించేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.



ముషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు అబ్దుల్ నఫీ, అర్చన తదితరులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జీజీ ఛారిటీ, నైన్ స్టార్ హెల్త్ కేర్ సంస్థల ప్రతినిధులు


ఐఎంఏ, టీ.జూడా ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

వైద్యురాలిని హత్య చేసిన దుండగులను శిక్షించాలి

ముషీరాబాద్/రాంనగర్/బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లకు భద్రత, రక్షణ కల్పించాలని కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అబ్దుల్ నఫీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అర్చన, శ్రీలత, స్వాతి, సాగర్, సయ్యద్ అబ్దుల్ అలీ, వంశీకిరణ్, ఆనంద్‌బాబు, ఆస్పత్రి మీడియా సెల్ విభాగం ప్రతినిధులు సతీష్, రాజేందర్ పాల్గొన్నారు. జీజీ ఛారిటీ, నైన్ స్టార్ హెల్త్ కేర్ సంస్థల ఆధ్వర్యంలో రాంనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి రాంనగర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సుచరితరెడ్డి, గంగాధర్‌గుప్తా, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి వైద్యులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రాంరెడ్డి, వైద్య ప్రముఖులు డాక్టర్ చంద్ర కాంత్ తపస్వి, డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి వైద్యుల నిరసన

బస్తీ దవాఖాన సిబ్బందికి ప్రతీ నెల జీతాలు : కోదండరామ్


ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సత్కరిస్తున్న తెలంగాణ బస్తీ దవాఖాన కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతీ నెల జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ ఎం.కోదండరామ్ హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తానన్నారు. శనివారం తెలంగాణ బస్తీ దవాఖాన కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి అంజాద్ అలీఖాన్, కన్వీనర్ ఉప్పలయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొ.కోదండరామ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారులు ఆకుల శ్రీనివాస్, ప్రతినిధులు డాక్టర్ డానియేల్, డాక్టర్ ఖాసీం, రామేశ్వర్‌రెడ్డి, సాయికుమార్, జగన్, స్వప్న, సాయిలు, శాంతమ్మ, అనిత, నర్సింహ పాల్గొన్నారు.

అభినందనలు

చిక్కడపల్లి/రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన తెలంగాణ ఉద్యమ రథసారథి, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. కోదండరామ్‌ను పలువురు ఉద్యమకారులు, తెలంగాణ జనసమితి నాయకులు శనివారం అభినందించారు. టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య ఆధ్వర్యంలో ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు జస్వంత్‌కుమార్, నాయకుడు కె.వెంకటేశ్వర్లు తదితరులు కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు చర్యలు చేపట్టాలి



ఇందిరాపార్కు వద్ద ధర్నాలో మాట్లాడుతున్న శివస్వామిజీ, వివిధ సంఘాల నేతలు



బాగ్‌అంబర్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

కవాడిగూడ/నల్లకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లోని హిందువులు, హిందూ ఆలయాల రక్షణ కోసం భారత ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద వీహెచ్‌పీ, హిందూ సంఘటన ఏక్తా మంచ్, గ్లోబల్ హిందూ హ్యూమన్ రైట్స్ కలెక్టివ్, వానరసేన, భారతీయ సనాతన సంఘ్, రాష్ట్రీయ శివాజీసేనల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా, నిరసన సభ జరిగింది. ఈసందర్భంగా శివస్వామీజీ, భైలారీ యోగేష్ స్వామీజీ, నాయకులు చేతన్‌గాడి, మాధవీలత, చీకోటి ప్రవీణ్, యోగేష్ ప్రభుయాదవ్, లడ్డాయాదవ్, శరత్‌ఓ మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులను ఉద్దేశపూర్వకంగా హత్య చేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లపై దాడులు చేస్తుండడం వల్ల బంగ్లాదేశ్‌లోని హిందువుల్లో భయాందోళన నెలకొందన్నారు. బంగ్లాదేశ్ సైన్యం హిందువుల భద్రతకు హామీ ఇచ్చినప్పటికీ భారత ప్రభుత్వం ఆ హామీపై ఆధారపడకుండా హిందూసమాజాన్ని, ఆలయాలను రక్షించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు గోవిందరాజు, నితిన్, అరుణసాగర్, కాసంశెట్టి శ్రీనివాస్, వెదిరె రాంరెడ్డి, వినోద్ పాల్గొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గ హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న హిందువులను రక్షించాలని శాంతియుత ర్యాలీ నిర్వహించారు. బాగ్‌అంబర్‌పేట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ తదితరుల పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలి

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడతల బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, సర్దార్ పాపన్న సినీహీరో పంజాల జైహింద్‌గౌడ్, గౌడ సంఘాల ప్రముఖులు రామ్మోహన్‌గౌడ్, ఎన్.శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, అంజిగౌడ్, హిమగిరిగౌడ్, నర్సింగ్‌గౌడ్, వాణిగౌడ్ పాపన్న చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. గౌడ్‌లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వరూపాగౌడ్, రమేష్‌గౌడ్, వీరయ్యగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న బాలకృష్ణగౌడ్, ఆనంద్‌గౌడ్ తదితరులు

విశిష్ట సేవా పురస్కారాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గౌడ ఐక్యసాధన సమితి, సర్వాయి పాపన్న జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి లోహియా భవనంలో శనివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు రంగాల్లో సామాజిక సేవలందించిన గరిగే శ్రీహరి గంగపుత్ర, దొమ్మేట వెంకటేష్ ప్రజాపతి, హరిత్‌నేతలకు సర్వాయి పాపన్న విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సినీహీరో పంజాల జైహింద్ గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బబ్బూరి భిక్షపతి, బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, మాల మహనాడు రాష్ట్ర నాయకుడు గంగాధర్, సీనియర్ జర్నలిస్ట్ దొమ్మేట వెంకటేష్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మెట్టు ధన్‌రాజ్, పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు హరిత్‌నేత రూడ, గాలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీ కార్మికులకు షిఫ్టింగ్ ఇంక్రిమెంట్లు, అలవెన్స్‌లు ఇవ్వాలి


వీఎస్టీ యూనియన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నేతలు

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ కంపెనీ ఆజామాబాద్ నుంచి తూప్రాన్‌కు షిఫ్ట్ అయిన నేపథ్యంలో కార్మికులకు 8 షిఫ్టింగ్ ఇంక్రిమెంట్లు, నెలకు 8 వేల షిఫ్టింగ్ అలవెన్స్‌లు ఇవ్వాలని వీఎస్టీ కంపెనీ ఐఎన్‌టీయూసీ విభాగం జి.సంజీవరెడ్డి గ్రూప్ కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ వర్కర్స్ యూనియర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నేతలు కె.రాజు, ఎల్‌డి.పాల్, జి.నగేష్ తదితరులు మాట్లాడారు. కంపెనీని తూప్రాన్‌కు బదిలీ చేయడం వల్ల కార్మికులకు అదనంగా 4 గంటల పనిభారం పెరుగుతుందన్నారు. కంపెనీలో కార్మికులకు రెస్ట్ రూమ్ లేదని, క్యాంటిన్ సౌకర్యం లేదని, డిస్పెన్సరీ లేదని, తాగునీటి సౌకర్యం లేదని ఆరోపించారు. ఈ సమస్యలను యాజమాన్యం, యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి పరిష్కరించడం లేదన్నారు. తమ డిమాండ్లపై చర్చిస్తామని శనివారం తమకు సమయం ఇచ్చి కేవలం ఐదుగురు మాత్రమే రావాలని నిబంధన పెట్టడం తగదన్నారు. తమ డిమాండ్లను అక్టోబర్ 2వ తేదీలోపు పరిష్కారం చేయాలని లేనిపక్షంలో దసరా పూజలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు ఏ.ఆర్.శ్రీనివాస్, సుందర్, సమద్, కరుణ్‌గౌడ్, కె.ప్రభాకర్, పి.నవీన్, శ్యాంసుందర్, జానకీరాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, అనంతరాం తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు రాకుండా ఆరోపణలు తగదు

ఐఎన్‌టీయూసీ నాయకులు సమస్యలపై చర్చకు రాకుండా ఆరోపణలు చేయడం, నిరసన తెలపడం తగదని యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ హరి సిల్వెస్టర్ బాబీ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రవీందర్ యాదవ్, కోశాధికారి నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు రాములు, రణదీర్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యలపై యాజమాన్యంతో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి చర్చిస్తున్నారని తెలిపారు.

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం

రాంనగర్/ముషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ గణేష్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ ఏడో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి హరిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూజలు చేశారు. గణేష్‌నగర్, లలితానగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు నేత శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ముషీరాబాద్‌లోని నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ముషీరాబాద్/రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ రాంనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, గౌరీ శంకర ఆలయ చైర్మన్ పి.శ్రీధర్‌చారి, మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనా యాదవ్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమం లో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న శ్రీధర్‌చారి, తదితరులు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పేదలకు మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్న ఆత్మవిశ్వాసంతో పేదలు మెరుగైన వైద్యం పొందుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని క్యాంపు కార్యాలయం వద్ద 77 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి తాను పునరంకితమై పనిచేస్తున్నానన్నారు. అన్నివర్గాల వారికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు మిర్యాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణమాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ

కవాడిగూడ/రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యాలయ ఇన్‌చార్జి మీసాల విఠల్‌రావు అన్నారు. శనివారం మందకృష్ణమాదిగను కలిసి శుభాకాంక్షలు తలిపారు. విఠల్‌రావు మాట్లాడుతూ వర్గీకరణ సాధించడంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నాల సురేందర్‌మాదిగకు ఘననివాళి

తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొన్నాల సురేందర్‌మాదిగ జయంతిని బాగ్‌లింగంపల్లిలో నిర్వహించారు. కూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కల్యాణ్, ప్రేమ్‌రాజ్, కె.రాజు, కృష్ణారావు, బాలస్వామి, బాల్‌రాజ్, కిశోర్, వేణు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణన చేయాలని, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి స్థానికసంస్థల ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన వేదిక ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ మాట్లాడారు. 23శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ కులగణన చేస్తామని అసెంబ్లీలో బిల్లు పెట్టడం హర్షణీయమన్నారు. నామినేటెడ్ పోస్టులను బీసీలకు అత్యధికశాతం కేటాయించాలని, ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, కో-ఆర్డినేటర్ దశరథం తదితరులు పాల్గొన్నారు.

'దళిత మహిళను హింసించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలి'

రాంనగర్/చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దళిత మహిళ కళావతిని చిత్రహింసలకు గురిచేసిన ఎస్ఐ రమేష్‌కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ఈ సంఘటనపై మహిళా కమిషన్, జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు స్పందించాలన్నారు. 8 నెలలుగా ఎస్సీ, ఎస్టీలపైన జరుగుతున్న అఘాయిత్యాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆరాధన కృష్ణయ్యకు ఆత్మీయ సత్కారం


కృష్ణయ్యను సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, చంద్రతేజ

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆరాధన సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు లోకం కృష్ణయ్యకు ఆత్మీయసత్కారం నిర్వహించారు. ప్రముఖ గాయకుడు, చంద్రతేజాలయ సంస్థ ప్రధాన నిర్వాహకులు చంద్రతేజ పర్యవేక్షణలో త్యాగరాయగానసభలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ చంద్రతేజ కొన్ని దశాబ్దాలుగా గాయకుడుగా పేరు గడించారన్నారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, చంద్రతేజ మాట్లాడుతూ టీవీ యాంకర్లు, న్యూస్‌రీడర్లు, ఆదర్శదంపతులకు అవార్డులు, ప్రతిభా పురస్కారాలు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్న కృష్ణయ్య అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో గాయనీగాయకులు రాధారాణి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం అధ్యక్షుడి ఎన్నిక

ముషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మానగర్ గంగపుత్ర సంఘం నూతన అధ్యక్షుడిగా బిజ్జి కనకేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం భోలక్‌పూర్‌లోని సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్‌రావు, ముఖ్యసలహాదారులుగా రాములు, యాదయ్య, ఉపాధ్యక్షులుగా అంజయ్య, రాజయ్య, దేవేందర్, స్వామి, యాదయ్య, కార్యాలయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులుగా శివకుమార్, రాజు, శేఖర్, యాదగిరి, కోశాధికారిగా శివకుమార్, సహాయ కార్యదర్శులుగా బాలు, సత్యనారాయణ, యాదగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కనకేష్‌కుమార్ మాట్లాడుతూ గంగపుత్రుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని యువతి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని యువతి

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని యువతి మృతిచెందింది. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న ఉదయం 5.30 గంటలకు కాచిగూడ-విద్యానగర్ రూట్‌లో 25 ఏళ్ల గుర్తు తెలియని యువతి రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 8712658584లో సంప్రదించాలని సీఐ సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.